క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: చింతపల్లి డివిజన్ పరిధిలో ఈనెల 25న జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఫీడర్ మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదని పాడేరు విద్యుత్ శాఖ ఈఈ ఏ.వి.ఎస్.ఎం.అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు చింతపల్లి మండల పరిధిలోని అన్నవరం, లోతుగెడ్డ, బలపంతో పాటు గూడెం కొత్తవీధి మండల పరిధిలోని రింతాడ, సంకాడ, పెదవలస, లక్కవరపుపేట, దేవరాపల్లి ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

27న మండల సమావేశం

ముంచంగిపుట్టు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 27న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు గత మూడు నెలలుగా చేసిన పనులపై పూర్తిస్థాయి సమాచారంతో విధిగా రావాలని, గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు


డి.రామవరంలో గొర్రెలకు మందు వేస్తున్న సిబ్బంది

అడ్డతీగల: మండలంలోని డి.రామవరం, మాలయ్యపాకలు గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.గణేష్ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. శిబిరంలో మేకలు, ఆవులు, గొర్రెలకు వ్యాక్సిన్‌లు వేశారు. పాడి రైతులకు మందులు అందజేశారు. సర్పంచ్‌లు అచ్చియ్యమ్మ, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ 2జీ సేవలు పునరుద్ధరించాలి


ఎంపీపీ రమేష్

కొయ్యూరు: మన్యంలో బీఎస్‌ఎన్‌ఎల్ 2జీ సేవలను పునరుద్ధరించాలని ఎంపీపీ బడుగు రమేష్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా మన్యంలో చాలా మంది బీఎస్‌ఎన్‌ఎల్ 2జీ సిమ్‌లను వినియోగిస్తున్నారన్నారు. అయితే బీఎస్‌ఎన్‌ఎల్ 3జీ, 4జీ సేవలు అందించే లక్ష్యంతో 2జీ సేవలు నిలిపివేయడం దారుణమన్నారు. పేద గిరిజనులు 4జీ, 5జీ సేవలు పొందే స్తోమత లేదని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకొని బీఎస్‌ఎన్‌ఎల్ ఉన్నతాధికారులు 2జీ సేవలను పునరుద్ధరించాలని కోరారు.

గిరిజన అభ్యర్థులతోనే పోస్టులు భర్తీ చేయాలి

అరకులోయటౌన్: పాడేరులోని మెడికల్ కళాశాలలో ఖాళీ ఉన్న పోస్టులను గిరిజన నిరుద్యోగులకే కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు.
ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పాడేరులోని మెడికల్ కళాశాలలో 244 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, వాటిలో గిరిజనేతరులకు కేటాయించిన పోస్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనేతర అభ్యర్థులచే భర్తీ చేయడంతో గిరిజన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఆదివాసీ గిరిజన అభ్యర్థులచే మెడికల్ కళాశాలలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

చివరి దశలో రబీ వరి నాట్లు

మాడుగుల : మండలంలో ఈ ఏడాది రబీ వరి నాట్లు దాదాపు పూర్తి కానున్నాయి. మండలంలో రబీ సాధారణ విస్తీర్ణం 4,200 ఎకరాలు కాగా ప్రస్తుతం 3,500 ఎకరాల్లో వరినాట్లు వేశారు.
ఈ ఏడాది కురిసిన తుపానులకు, భారీ వర్షాలకు జలాశయాలతో పాటు పంట చెరువుల్లో సాగు నీరు పుష్కలంగా ఉండడంతో రబీ వరి పంట మంచి దిగుబడి ఇస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లీ ఇక్కట్లు?

- అసంపూర్తిగా అంగన్‌వాడీ కార్యకర్తల మీటింగ్ హాల్
- ఆరుబయటే సమావేశాలు
- సిబ్బందికి తప్పని కష్టాలు
- పట్టించుకోని అధికారులు


ఆరుబయట వరండాలోని సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ సమావేశ మందిరం

ముంచంగిపుట్టు: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశ మందిరం పూర్తి కాకపోవడంతో ఆరుబయట, పరాయిపంచనే సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలో 19 సంవత్సరాల క్రితం రూ.70 వేలతో మంజూరైన సమావేశ మందిర భవన నిర్మాణం గోడల వరకు చేపట్టారు. నిధులు విడుదల కాక పనులు అసంపూర్తిగానే వదిలేశారు. దీంతో సుమారు రెండు దశాబ్దాలుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశ భవనం లేకుండా పోయింది. మండలంలోని ప్రతి నెల 99 ప్రధాన, 130 మినీ కేంద్రాల నుంచి వచ్చే కార్యకర్తలకు సమావేశం జరుగుతుంది. మీటింగ్ హాల్ లేక ఆరుబయటే సమావేశాలు నిర్వహించాల్సి వస్తుందని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని చెబుతున్నారు. నిధులు మంజూరైతే తప్ప భవనం పూర్తి కాని పరిస్థితి ఉందంటున్నారు.

వసతి సమస్యతో సతమతం

ప్రతి నెల సమావేశాలను ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలోని ఆరుబయట నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. వర్షాలు కురిసినపుడు సమావేశాలు అర్ధంతరంగా ముగించిన సందర్భాలున్నట్టు పేర్కొంటున్నారు. వసతి సమస్య వల్ల సమావేశం ముగిసేంత వరకు గంటలకొద్దీ నిలబడి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమావేశాలను ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరం, అక్కడ వీల్లేకుంటే స్థానిక కల్యాణ మండపంలో అప్పుడప్పుడు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉన్న సమావేశ మందిరం పూర్తి చేయాలని సీఐటీయూ నేతలు, గిరిజన సంఘం నాయకులతో కలిసి పలుమార్లు ఐసీడీఎస్ అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి

ప్రతి నెల ప్రాజెక్టు సమావేశాలను కార్యాలయం బయట వరండాలోనే నిర్వహించాల్సి వస్తోంది. ఎండకి, వానకి ఇబ్బందులు పడుతున్నాం. సమావేశం ముగిసేంత వరకు కొంతమంది కూర్చుని మరికొంతమంది నిలబడి ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి సమావేశ భవనం సమస్య పరిష్కరించాలి.
– కె. భవాని, అంగన్‌వాడీ టీచర్, ముంచంగిపుట్టు మండలం

అధికారులు స్పందించాలి

అంగన్‌వాడీ సమావేశ మందిర భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండడం వల్ల ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. భవనానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తే 23 పంచాయతీల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలు నిర్వహించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– కె.శంకర్‌రావు, సీఐటీయూ మండల అధ్యక్షుడు, ముంచంగిపుట్టు

ప్రతిపాదనలు పంపాం

భవనం పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. గతంలో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో పనులు పూర్తి కాలేదు. సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. భవనం పూర్తి చేయడానికి రూ.10 లక్షలు అవసరమున్నట్టు గుర్తించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– వరహాలమ్మ, సీడీపీవో, ముంచంగిపుట్టు

ఖాళీ స్థలంలో సంత ఏర్పాటుకు చర్యలు


పెదవలసలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో వారపు సంత స్థలం మార్పునకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు సీఐ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన గ్రామంలో పర్యటించి, వర్తకులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. గతంలో సింగిల్ రోడ్డుగా ఉండే పెదవలస ప్రధాన రహదారి ప్రస్తుతం జాతీయ రహదారిగా మార్పు చెందిందన్నారు. ఈ కారణంగా రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతోందన్నారు.
గతంలో మాదిరిగా ఈ ప్రాంతంలో సంత నిర్వహిస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందన్నారు. ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు జరగకుండా, సంత వల్ల ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ ద్వారా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. పెదవలసలో ఖాళీగా ఉన్న స్థలంలో వారపు సంత నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు దుకాణదారులు, వర్తక సంఘం నాయకులు తమకు సహకరించాలని సీఐ వరప్రసాద్ కోరారు.

ప్రొటోకాల్ పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు

ముంచంగిపుట్టు: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు తెలిపారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగబంధు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను పక్కన పెట్టడం సరికాదన్నారు. పంచాయతీల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమంపై సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని, ప్రొటోకాల్ పాటించని అధికారులపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, సర్పంచులు రమేష్, నీలకంఠం, నేతలు జగన్నాథం, సన్యాసిరావు, తిరుపతిరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ


పి.యర్రగొండలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ రైతు భరోసా కేంద్రంలో పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల రాజేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొని 20 మంది రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, ఆర్.ప్రవీణ్‌బాబు, కె.వీరాంజనేయులు మాట్లాడుతూ విత్తనాలు నాటే విధానం, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఎంఏవో వి.ఉషారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ

ముంచంగిపుట్టు: మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై 1,670 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ ఆర్.వి.ఎస్.నర్సమ్మ చెప్పారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో ఆమె గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో గ్రామస్తుల ఆందోళన


గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ: కొత్తవలసలో దుమ్ము ధూళితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం నాయకులు గురువారం గ్రామస్తులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ డుంబ్రిగుడ, కించుమండ మధ్య ఉన్న ప్రధాన రహదారిని కొత్తవలస గ్రామంలోకి మళ్లించడంతో వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ కారణంగా దుమ్ము ధూళితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

1న ప్రసాద విక్రయాలకు వేలంపాట

కూనవరం: మండలంలో కుమారస్వామి గుట్టపై కొలువుదీరిన వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వారి ఆలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 26న నిర్వహించనున్న శివరాత్రి వేడుకల్లో పూజసామగ్రి, ప్రసాదం అమ్మకాలకు వేలంపాటను 1వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ సాయిబాబా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో కొబ్బరి కాయల విక్రయాలు, సేకరణకు రూ.5వేలు, లడ్డూ ప్రసాద విక్రయానికి రూ.5వేల ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని సూచించారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



అరకు, పాడేరు కళాశాలలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


డుంబ్రిగుడలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పాఠశాల సిబ్బంది

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధ్యాపకురాలు వై.విజయలక్ష్మి మాట్లాడుతూ నేతాజీ సేవలు మరువలేనివన్నారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ కొండబాబు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు నాగబాబు, అనితకుమారి, అధ్యాపకులు గణేష్, సుందరిరాణి, లచ్చన్న, రాజు, కామేశ్వరరావు, అప్పారావు, సోంబాబు, సునీల్‌కుమార్, అంబిక, దొన్ను తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయ్ ఆదేశాల మేరకు కాలేజీలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.ఎస్.రసూల్ మాట్లాడుతూ తెల్లదొరలను గడగడలాడించిన పోరాటయోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఈ సందర్భంగా అధ్యాపకులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. యువత స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో రమేష్‌బాబు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ కోటేశ్వరరావు, అధ్యాపకులు మురళీధర్‌రావు, జయలక్ష్మి, మత్స్యరాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.సంజీవరావు తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివన్నారు. ఉపాధ్యాయులు బాలకృష్ణ, నిరంజన్, తులసీదాస్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

40 టన్నుల రాగులు కొనుగోలు


రాగులు కొనుగోలు చేస్తున్న అధికారులు

డుంబ్రిగుడ: సాగర, కొర్రాయి, పోతంగి, అరమ ప్రాంతాల్లో సుమారు 40 టన్నుల రాగులు కొనుగోలు చేసినట్టు ఏవో నీలవేణి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాగులను పాడేరు, అరకులోయ గొడౌన్‌లకు తరలిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం సూచించిన ధరల ప్రకారం కిలో రూ.42.90 చొప్పున కొనుగోలు చేశామని, మరో 20 టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. లారీల్లో రాగుల బస్తాలను తరలిస్తున్నట్టు చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


అవగాహన కల్పిస్తున్న నిమ్స్ ప్రతినిధులు

మారేడుమిల్లి: ప్రభుత్వ ఉద్యోగులు ఒత్తిడిని జయించి ఆరోగ్యవంతంగా ఉంటే విధి నిర్వహణలో విజయం సాధించవచ్చని ఎంపీడీవో తూతిక విశ్వనాథ్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ నిమ్స్ ప్రతినిధి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రత్నకుమారి, సిబ్బంది కిరణ్, రేచల్, రాహుల్, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు పనులు


కలెక్టరేట్ వద్ద చేపడుతున్న రోడ్డు పనులు

సాక్షి,పాడేరు: తలారిసింగి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.40లక్షలతో ఈ రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో రహదారి విస్తరణ, సీసీ రోడ్డు పనులు జరిగాయి. ప్రస్తుత కలెక్టర్ దినేష్‌కుమార్ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎటపాక: మండలంలోని వెంకటరెడ్డిపేటలో ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురువారం ఘనంగా జరిగింది. భద్రాచలంలోని ప్రభుత్వ కాలేజీలో 1975 బ్యాచ్ ఇంటర్‌మీడియట్ చదువుకున్న విద్యార్థులంతా గ్రామంలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని మురిసిపోయారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఆటపాటలతో సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు గడిపారు. పూర్వ విద్యార్థులు ముక్తేశ్వరరావు, రమణ, హరిబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైభవంగా మల్లికార్జునస్వామి తీర్థం


పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : చంద్రయ్యపేట గ్రామస్తులు మల్లికార్జునస్వామి తీర్థ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలను జరిపారు. బంధువుల, స్నేహితుల రాకతో గ్రామంలో సందడిగా మారింది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సబ్బవరపు అప్పలనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పార్వతి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ, ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి : మామిడిపల్లిలో మరిడిమాంబ తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా స్థాయి ఎడ్ల బళ్లు, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఎడ్ల పోటీల విజేతలకు వరుసగా రూ.10 వేలు, 8 వేలు, 6 వేలు, 4 వేలు, 2 వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పెదగోగాడలో లేగ దూడల ప్రదర్శన

చీడికాడ : మండలంలోని పెదగోగాడలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదగోగాడ, అడవి అగ్రహారం, జి.కొత్తపల్లి, తురువోలు, అర్జునగిరి గ్రామాల నుంచి పాడిరైతులు తమ వద్ద గల మేలు జాతి ఏడాది లోపు గల జెర్సీ,హెచ్‌ఎఫ్, ముర్రా గేదె జాతి లేగదూడలను ఈ ప్రదర్శనకు తీసుకొచ్చారు.మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ చిట్టినాయుడు తదితరులు పాల్గొన్నారు.